బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, హరీశ్‌రావు, సురేశ్‌రెడ్డి, మధుసూదనాచారి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్, నిరంజన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, మహమూద్ అలీ, బండా ప్రకాశ్, నామా నాగేశ్వరరావు, ఎల్ రమణ, స్వామిగౌడ్ తదితరులు

తెలంగాణ కన్నీళ్లు తెలిసింది బీఆర్ఎస్‌కే

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ అస్తిత్వ పటిష్టతకు కృషి చేస్తూ, గత గాయాల నుంచి కోలుకున్న తెలంగాణను, తిరిగి అవే కష్టాలపాలు కాకుండా, గత దోపిడీ వలసవాదుల బారిన పడకుండా, తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయం అందించే దిశగా సమస్త పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఉద్బోధించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా పటిష్ట నిర్మాణం చేసి అటు పార్టీ విజయాన్ని, ఇటు తెలంగాణ ప్రజల శాశ్వత విజయం కోసం సమాంతరంగా పని చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25వ సంవత్సరంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో రజతోత్సవాలను ఏడాది పాటు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీలను సంపూర్ణంగా వేసుకుందామని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జడ్పీ మాజీ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, బీఆర్ఎస్ నేత వంశీధర్‌రావు, ఇతర ముఖ్యనేతలు హాజరయ్యారు. సమావేశ ప్రారంభం నుంచి కేసీఆర్ దాదాపు రెండు గంటల పాటు ప్రసంగించారు. తెలంగాణ చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిణామక్రమాన్ని వివరించారు.

అసాధారణ చైతన్యం తెలంగాణది

రాజుల కాలం నుంచి నిజాం రాజుల దాకా రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటాలు.. తద్వారా ప్రజల్లో రగలిన చైతన్యాన్ని కేసీఆర్ సోదాహరణగా వివరించారు. నాటి హైదరాబాద్ సంస్థానం ఒక దేశంగా వెలుగొందిన తెలంగాణ, ప్రజాస్వామిక భారతదేశంలో విలీనమైన తర్వాత ఒక రాష్ట్రంగా కూడా తన అస్థిత్వాన్ని చాటుకోలేక పోవడం శోచనీయమని వాపోయారు. అందుకు రాజకీయంగా తెలంగాణ నాయకత్వాన్ని విస్మరించి, నాటి కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అనుసరించిన కుట్రపూరిత రాజకీయాలను ఏకరువు పెట్టారు. 'తెలంగాణ సమాజం అనుభవించిన భయంకరమైన గాయాలు, కష్టాలు, బాధలు ఒక్కనాటివి కావు. ఒకటిన్నర శతాబ్దం పాటు కొనసాగిన బాధల.. గాయాల చరిత్ర తెలంగాణది. రాచరిక పాలన నుంచి భూస్వాములు, గడీల దొరల పీడన అంతా ఒక పెద్ద దుఃఖం. ఇప్పుడు చాలామంది చాలా మాట్లాడుతుంటారు కానీ, తెలంగాణ చరిత్రను అర్థం చేసుకుంటే గుండె బరువెక్కిపోతది. నేను ఒక వ్యక్తిగా ఒక దశాబ్దం పాటు స్వయంగా ఆ క్షోభ అనుభవించిన. నలిగిపోయిన. నేను మొదలై ననాడు తెలంగాణ వస్తదని ఒక్కరిలో కూడా విశ్వాసం లేకుండె' అని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. ఎక్కడ చూసినా తెలంగాణలో నెత్తురు ఏరులై పారిన సందర్భంలో తన ఉద్యమ ప్రస్థానాన్ని వివరించారు.

> 'తెలంగాణ సమాజం అనుభవించిన భయంకరమైన గాయాలు కష్టాలు , బాధలు ఒక్కనాటివి కావు. ఒకటిన్నర శతాబ్ద కాలంపాటు కొనసాగిన బాధలు, గాయాల చరిత్ర తెలంగాణది. రాచరిక పాలన నుంచి భూ స్వాములు, గడీల దొరల పీడన అంతా ఒక పెద్ద దుఃఖం. ఇప్పుడు చాలామంది మాట్లాడుతుంటరు కానీ, తెలంగాణ చరిత్రను అర్థం చేసుకుంటే గుండె బరువెక్కిపోతది. నేను ఒక వ్యక్తిగా దశాబ్దం పాటు స్వయంగా ఆ క్షోభ అనుభవించిన. నలిగిపోయిన.
>
> -బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

అనాది నుంచి తెలంగాణకు కాంగ్రెస్ ద్రోహం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు రాలేదని, తెలంగాణ ఇంకా నిజాంపాలనలో ఉంటే భారత మిలటరీ సైనిక ఆక్రమణకు పాల్పడిందని కేసీఆర్ వివరించారు. భారత ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యతో 20-30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, వీరిలో కొంత మంది రజాకార్లు ఉన్నా మరికొంత మంది సామాన్యులు, కమ్యూనిస్టులు కూడా ఉన్నారని, మాజీ హోంమంత్రి దివంగత నాయిని నర్సింహారెడ్డి తండ్రి వంటివారు ఎందరో మరణించారని గుర్తుచేశారు. సాయుధ పోరాటం తర్వాత తెలంగాణను ఆంధ్రాలో అన్యాయంగా విలీనం చేయడం వల్ల యువత, ప్రజల్లో అలజడి పెరిగిందని తెలిపారు. 'ఆత్మగౌరవ పోరాటాలు చేసింద్రు. ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' వంటి అనేక ఉద్యమాలు మొదలైనయి. తెలంగాణకు ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగే అన్ని అర్హతలు ఉన్నయని మొదటి రాష్ట్రాల పునర్విభజన సంఘం (ఫజల్ అలీ కమిషన్) స్పష్టం చేసింది' అని గుర్తుచేశారు. 'ఫజల్ అలీ కమిషన్ సిఫారసులను తుంగలో తొక్కింది నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. అట్లా 1969 ఉద్యమంలో తెలంగాణ బిడ్డలను పిట్టలను కాల్చినట్టు కాల్చేసింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. ముల్కీ రూల్స్‌కు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అదే ఇందిరాగాంధీ పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగాన్ని సవరించి మరీ ముల్కీ రూల్స్ రద్దు చేసింది. ఇట్లా చెప్పుకొంటూ పోతే ఒక్క ద్రోహం కాదు. నీటి వాటాల కోసం బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు, పలు రకాలుగా తెలంగాణ హక్కులను కాలరాసింది కాంగ్రెస్ పార్టీ. వీటినుంచి కాపాడేందుకు నాడు ఒక్క నాయకుడు కూడా మాట్లాడలేదు' అని గత స్థితిగతులను కేసీఆర్ వివరించారు.

విస్తృతస్థాయి సమావేశంలో ఉల్లాసంగా చిరునవ్వులు చిందిస్తున్న కేసీఆర్, సురేశ్‌రెడ్డి, కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, హరీశ్, జగదీశ్‌రెడ్డి తదితరులు

> వలసాంధ్ర ముఖ్యమంత్రులుగా పని చేసినోళ్లు తెలంగాణను అన్నివిధాలా నాశనం చేసింద్రు. అధికారం వాళ్ల చేతుల్లోనే.. మీడియా వాళ్ల చేతుల్లోనే.. మనకో దారీ, తెన్నూ లేదు.. కరెంటు లేదు.. బొంబాయి.. దుబాయ్ వలసలు.. తెలంగాణ పల్లెల్లో నెలకు మూడు పాడెకట్టెలు ఎందుకో అని గోరటి వెంకన్న లాంటి కవుల వలపోతలు.. గంజి కేంద్రాలు నడిపించిన గోస.. వీటిపై నాటి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఒక్కరు కూడా మాట్లాడలేక మౌనం దాల్చింద్రు.
>
> -బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

శతాబ్దాల గోసకు ఫుల్‌స్టాప్ పెట్టాలనుకున్న..

'నాడు కాంగ్రెస్ చేసిన, చేస్తున్న ద్రోహం ఒక వైపు.. మరోవైపు చంద్రబాబు సృష్టించిన కర్కశత్వం తెలంగాణను ఆగం చేసినయ్. చంద్రబాబు కరెంటు చార్జీలు పెంచాలని నిర్ణయం తీసుకోవడంతో సహించలేక పోయిన. ఎట్లయితె అట్లాయే.. ఈ తెలంగాణ శతాబ్దాల గోసకు ఎక్కడో ఒక చోట ఫుల్‌స్టాప్ పెట్టవలసిందే అని గట్టి నిర్ణయం తీసుకున్న. ఒక్కడిగానే బయలుదేరిన. 1999 - 2000 సంవత్సరం నుంచి మొదలైన నా తెలంగాణ ఉద్యమ ప్రస్థానం 25 ఏండ్లకు చేరుకున్నది' అని కేసీఆర్ వివరించారు. 'తెలంగాణ సాధన ద్వారానే మన కష్టాలు తీరుతయని టీఆర్ఎస్ పార్టీ పెట్టిన నాడు నాకు ఆఫీస్ కూడా దొరకనియ్యలే. కొండా లక్ష్మణ్ బాపూజీ తన నివాసం జలదృశ్యంలో ఆఫీస్ ఇస్తే దాన్ని కూల్చి వేసింది నాటి ప్రభుత్వం' అని గుర్తుచేశారు. కానీ, ఇవ్వాళ తెలంగాణ గర్వించే వేదికగా ఈ తెలంగాణ భవన్‌ను ఏర్పాటు చేసుకున్నామని, దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఒకటి రెండు జిల్లాలు మినహాయిస్తే అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలు నిర్మితమయ్యాయని చెప్పారు.

ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు పక్కా..

బెల్లం చుట్టూ ఈగలు వాలినట్టు కొంత మంది సన్ ఫ్లవర్ల లెక్క తిరుగుతుంటారని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల తీరుపై కేసీఆర్ నిప్పులు చెరిగారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు పక్కాగా వస్తాయని న్యాయనిపుణులు చెప్తున్నారని, ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని ఉద్బోధించారు.

> తెలంగాణ సమాజం చారిత్రక అవసరం దృష్ట్యా పురుడుపోసుకున్న బీఆర్ఎస్‌ను నలిపివేయాలని అనేక కుట్రలు సాగినయి. తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలను చైతన్య పరుస్తూ, తెలంగాణ అస్తిత్వ పటిష్టతకు కృషిచేస్తూ, గత గాయాల నుంచి కోలుకున్న తెలంగాణను తిరిగి అవే కష్టాల పాలు కాకుండా.. గత దోపిడీ వలసవాదుల బారిన పడకుండా.. తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయం అందించే దిశగా పార్టీ శ్రేణులు కృషి చెయ్యాలె.
>
> -బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఉద్యమం మొదలుపెట్టేనాటికే 27 మీటింగ్‌లు

'2001 ఏప్రిల్ 27న పార్టీ ప్రారంభించే ముందే ఉద్యమ ప్రస్థానం ఎలా ఉండాలి? రాజకీయ పార్టీని ఎలా నడపాలి? తెలంగాణ ఎలా సాధించాలన్నదానిపై అనేక సమావేశాలు పెట్టుకున్నం. 27 మీటింగ్‌లు పెట్టుకున్నం. అనేక వర్గాలతో సమావేశాలు నిర్వహించినం. ఉద్యమం అంటే అనుమానాలు వ్యక్తం చేసే వాళ్లు. నిరాశానిస్పృహలతోనే ఉండేవారు. అలాంటి సందర్భంలో అనేక చర్చోపచర్చలు జరిగినయి. మేధావులు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు, రైతు సంఘాల నేతలు ఇలా అనేక మందితో చర్చలు జరిపినం. తెలంగాణ ఉద్యమానికి దారీతెన్నూ తెలియని సందర్భంలో పార్టీని పెట్టి, ఉద్యమం చేసినం. 2001 ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేసినం' అని కేసీఆర్ వివరించారు.

నక్సలైట్ ముద్రవేసి పట్టుకపోయిండ్రు

'తెలంగాణలో ఆనాడు ఎక్కడ చూసినా విన్నా 'నెత్తురు కారంది ఎక్కడ నా తెలంగాణలో.. నేలకు రాలకుండా ఉన్నదా తెలంగాణ జిల్లాలోనా' అన్న పాట వినిపించేది. పోలీసులు నక్సలైట్ల ఏరివేత పేరుతో ఇండ్లలో ఉన్నవారిని కూడా తీస్కపోయి ఎన్‌కౌంటర్లు చేసేవాళ్లు. ఎన్‌కౌంటర్లు చేయవద్దని, ఒకవేళ పోలీసులకు ఏమైనా అనుమానాలుంటే అరెస్టు చేయాలని, కేసులు పెడితే కోర్టుల్లో చూసుకుంటారని నాటి పోలీసు అధికారులతో చెప్పిన. ఇంట్లో పడుకున్నవారిని, పనులు చేసుకుంటున్నవారిని కూడా నక్సలైట్లు అన్న ముద్ర వేసి ఎలా అరెస్టు చేస్తారని నాటి సీఎం చంద్రబాబునాయుడును కూడా ప్రశ్నించిన. ఆనాడు పెద్దపల్లికి చెందిన ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి కూడా చంద్రబాబును ఇదే విషయమై నిలదీసిండు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తనని కూడా చెప్పిండు' అంటూ నాటి విషయాలను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు.

> నెత్తురు కారందెన్నడో నా తెలంగాణ పల్లెల.. నేలకు రాలందెన్నడో నా తెలంగాణ జిల్లాలో అని నాడు ప్రజల గోస మీద వినిపించిన పాట నన్నెంతగానో బాధించింది. తెలంగాణకు ఎవడు చేసిన పాపమిది? దానికి నిష్కృతి లేదా? అని నేను ఆలోచించేది. నక్సలైట్ పేరుతో ఇంట్ల పండుకున్నోళ్లను పట్టుకపోయి కాల్చి సంపుడు.. వాళ్ల ప్రజలను సంపుతుంటే నాటి తెలంగాణ ఎమ్మెల్యేలు కూడా క్షోభ అనుభవించేటోళ్లు.
>
> -బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

బాబు సీఎం అయ్యాక విద్యుత్తు చార్జీల పెంపు

తెలంగాణ రైతాంగానికి విద్యుత్తు చార్జీలు భారంగా ఉండేవని, తాను తొలిసారి ఎమ్మెల్యే అయిన తర్వాత రైతులు ఇదే విషయాన్ని తన దృష్టికి తీసుకొస్తే తాను నేరుగా నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో చెప్పానని, ఎన్టీఆర్ అందరితో మాట్లాడి చివరికి తాను చెప్పినదానికి ఒప్పుకొన్నారని, అరకంగా అప్పటి వరకు రైతాంగంపై ఉన్న శ్లాబుల భారం తగ్గిందని కేసీఆర్ తెలిపారు. కానీ, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ప్రపంచబ్యాంకు సంస్కరణల పేరుతో మళ్లీ విద్యుత్తు చార్జీలను పెంచారని చెప్పారు. దీన్ని తాను అడ్డుకునే ప్రయత్నం చేశానని, ప్రభుత్వంలో ఉండే చంద్రబాబుతో కొట్లాడనని గుర్తుచేశారు. కానీ, చివరికి మోయలేని భారాన్ని రైతులపై మోపడంతో ఇక లాభం లేదనుకొని లేఖ రాశానని, అనేక పోరాటాలు, ఉద్యమాల తర్వాతనే తెలంగాణ వచ్చిందని వివరించారు.

> రాష్ట్రంలో మొదటి త్రైమాసికానికే రెవెన్యూ లాస్ రూ.15 వేల కోట్లు ఉన్నది. అది రూ.30 వేల కోట్లకు చేరుతుందని ఆర్థిక నిపుణులు చెప్తున్నరు. ఇంత హీనమైన పాలన ఇంకెక్కడా ఉండది. పదేండ్లు అద్భుతంగ పాలించినం. ఏనాడూ ఈ దుస్థితి ఎదురుకాలేదు. ఇప్పుడు రాష్ట్రంలో అన్ని రంగాలు పడకేసినయి. ప్రభుత్వాలు మారితే గత పాలన కంటే మెరుగ్గా చేయడమో, లేక పాత పథకాలనే కొనసాగించటమో ఆన వాయితీ. కానీ, రాష్ట్రంలో అదేమీ లేదు.
>
> -బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

బంపర్ మెజారిటీతో గెలుస్తం.. అనుమానం అక్కర్లేదు

'రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే బంపర్ మెజారిటీ. అందులో ఎవరికీ అనుమానం అక్కర్లేదు' అని కేసీఆర్ తేల్చిచెప్పారు. కేవలం 14 నెలల కాలంలోనే కాంగ్రెస్ పార్టీ తమను మోసం చేసిందని యావత్ తెలంగాణ సమాజం నిర్ధారణకు వచ్చిందని వివరించారు. 'ఎన్నికలు వస్తయి.. పోతయి.. గెలుస్తం... ఓడుతం. బీఆర్ఎస్‌ది గెలుపోటముల ప్రయాణం కాదు. అందుకోసం బీఆర్ఎస్ పుట్టలేదు' అని స్పష్టంచేశారు. 'తెలంగాణ సమాజం గెలుపు కోసం.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా పనిచేయటమే బీఆర్ఎస్ లక్ష్యం' అని పునరుద్ఘాటించారు. తెలంగాణ కోసం బయలుదేరి ననాడు ఏ లక్ష్యం కోసం చిత్తశుద్ధితో పనిచేశామో అదే లక్ష్యం కోసం బీఆర్ఎస్ జీవితాంతం పనిచేస్తుందని స్పష్టంచేశారు.

ప్రజాసమస్యలపై బీఆర్ఎస్ పోరుబాట

విస్తృతస్థాయి మీటింగ్‌లో నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట నడపాలని బీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో 30 మంది మాట్లాడారు. పార్టీ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు, ఆదర్శ్‌రెడ్డి, సత్యవతి, వాల్యానాయక్, సోహైల్, పాల్వాయి స్రవంతి, క్యామ మల్లేశ్, దాసోజు శ్రవణ్, మసిఉల్లాఖాన్, చంద్రగౌడ్, మూల విజయారెడ్డి, మెట్టు శ్రీనివాస్, వీరభద్రరావు, రాజావర ప్రసాద్, రాకేశ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాసరి ఉష మాట్లాడారు.

పార్టీ కోసం పనిచేద్దాం

'ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు చూస్తుంటే బీఆర్ఎస్ బీఫారం తెచ్చుకున్న ఎవ్వరైనా ఎమ్మెల్యేలవుతారు. పార్టీ కోసం పనిచేద్దాం. ప్రజా సమస్యలపై పోరాటాలు చేద్దాం.

- శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి

చరిత్ర రచన చేయాలి

ఇది ఒక్క బీఆర్ఎస్ ఉత్సవం కాదు. తెలంగాణ ప్రజల ఉత్సవం. చరిత్ర రచన జరగాల్సిన అవసరం ఉన్నది.

- దేశపతి శ్రీనివాస్

కార్యకర్తల బలం ఉంది

పార్టీకి అద్భుతమైన కార్యకర్తల బలం ఉన్నది. సోషల్ మీడియాపై నా పార్టీ ఇంకా దృష్టి పెట్టాలి. శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసి సంస్థాగత నిర్మాణాన్ని పూర్తిచేసుకుంటే మరింత బలోపేతం అవుతుంది.

- తాతామధు, ఎమ్మెల్సీ

ఏ బాధ్యత అప్పగించినా

నాకు ఏ బాధ్యత అప్పగించి చేస్తా. ఈ ప్రభుత్వం అవార్డు ఇచ్చింది. కేసీఆర్ అనుమతిస్తేనే తీసుకుంటా.

- గోరటి వెంకన్న

ఏడాదిపాటు ఉత్సవాలు



రజతోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలను ఏడాది పాటు నిర్వహించుకుందాం. ప్రభుత్వ దుర్మార్గాన్ని ఎండగడుతూ పార్టీ గొప్పతనాన్ని వివరించేలా పాటలు, నాటకాలు రూపొందిద్దాం.

- రసమయి బాలకిషన్

52 దేశాల్లో వేడుక

బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాలను 52 దేశాల్లో నిర్వహించాలని నిర్ణయించాం. ఈ మేరకు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఏర్పాట్లు చేస్తున్నది. ఏదైనా ఒక దేశానికి కేసీఆర్ కూడా వస్తే బాగుంటుంది. - మహేశ్ బిగాల

ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కేసీఆర్ అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కేసీఆర్ గురించి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ అనిల్‌కుమార్ అద్భుతంగా చెప్పారు. అలాంటి వాటిని మనం విస్తృతంగా ప్రచారం చేయాలి.

- పంజుగుల శ్రీశైల్‌రెడ్డి

ఆన్‌లైన్ సభ్యత్వం చేపట్టాలి

బీఆర్ఎస్ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు చేపట్టాలి. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్ రూపొందించి నిర్వహించాలి. సోషల్ మీడియాను పటిష్టం చేయాలి - విలాస్‌రావు

పోటెత్తిన అభిమానం

- కేసీఆర్‌ను చూసేందుకు భారీగా వచ్చిన యువత
- కిటకిటలాడిన తెలంగాణ భవన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూసేందుకు హైదరాబాద్ తెలంగాణ భవన్‌కు యువత భారీగా తరలివచ్చింది. బుధవారం పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి కేసీఆర్ హాజరవుతారని మీడియా ద్వారా తెలియడంతో యువకులు భారీ సంఖ్యలో పోటెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ముఖ్య నాయకుల వెంట, స్వచ్ఛందంగా అభిమానులు, కార్యకర్తలు రావడంతో వారిని నియంత్రించడానికి పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలంతో తెలంగాణభవన్ పరిసరాల్లో సందడి నెలకొన్నది. వందలాది వాహనాలు రోడ్ల వెంట బారులుదీరాయి. చాలారోజుల తర్వాత కేసీఆర్ తెలంగాణ భవన్‌కు రావడంతో ఆయనను చూడాలని, ఆయనతో సెల్ఫీ దిగాలనే ఉత్సాహంతో యువకులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కేసీఆర్ వస్తారని షెడ్యూల్ ప్రకటించినప్పటికీ, ఉదయం 10గంటల నుంచే యువకులు గేట్ల వద్ద పడిగాపులు కాశారు. పార్టీ ఆహ్వానించిన నేతలనే లోపలికి అనుమతించగా, మిగతా వారు అక్కడే ఉండి కేసీఆర్ కోసం ఎదురుచూశారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత కేసీఆర్ రావడంతో ఒక్కసారిగా బయట ఉన్నవారు తోసుకొచ్చారు. కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. వీలుపడని వారు ఆయన కారు దిగుతుండగా సెల్ఫీలు దిగారు.

ఎవడన్న వింటే తెలంగాణ పజీత పోతది

- నా మంత్రులు పనిచేయనిస్తలేరు.. ఐఏఎస్‌లు మాట వింటలేరంటరా?
- ఇంతకన్నా పరువుపోయే ముచ్చట ఇంకోటి ఉంటదా?
- పదేండ్లు ఎంత అభివృద్ధి చేసినమో కాగ్ నివేదికల లెక్కలే సాక్ష్యం
- అవి డిలీట్ చేస్తే పోతయా? : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిలదీత

తెలంగాణలో భవన్‌లో కేసీఆర్‌కు నమస్కరిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): 'ఎవడన్నా వింటే తెలంగాణ పజీత పోద్ది. ఎక్కడైనా సీఎం అనేవాడు నా మంత్రులు నాకు వింటలేరు. నన్ను పనిచేయనిస్తలేరు' అని అంటారా? అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఎక్కడా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల పేర్లను ప్రస్తావించకుండానే 14 నెలలుగా కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను చీల్చిచెండాడారు. 'ఎన్నికల ముందు పీపీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు డిసెంబర్ 9న మన ప్రభుత్వం వస్తుంది. మీరు ఇప్పటి దాకా రుణాలు తీసుకోకపోతే వెళ్లి తీసుకోండి. నేను వచ్చిన తర్వాత రూ.2 లక్షల రుణమాఫీ చేస్తా అన్నడు. జనం మోసపోయి, ఆశపడ్డరు. ఇప్పుడు నాలుక మడతపెడుతున్నడు' అని విమర్శించారు. 'రుణమాఫీ ఎప్పుడిస్తవు అని బీఆర్ఎస్ వెంబడిపడితే ఆఖరికి ఇగో ఇస్తున్నమని ప్రభుత్వం గొప్పలు చెప్పుకున్నది' అని ఎద్దేవాచేశారు. వాస్తవానికి 30-35 శాతం కూడా రుణమాఫీ కాలేదని, రైతులు ప్రభుత్వంపై తిరగబడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. 'ఎవడన్న వింటే తెలంగాణ పజీత పోద్ది. ఎక్కడైనా సీఎం అనేవాడు నా మంత్రులు నాకు వింటలేరు. నన్ను పనిచేయనిస్తలేరు' అని అంటారా? ఐఏఎస్ అధికారులు, ఐపీఎస్ అధికారులు నా మాట వింటలేరు' అని అంటరా? ఇంతకన్నా పరువుపోయే ముచ్చట ఇంకోటి ఉంటదా?' అని నిప్పులు చెరిగారు.

తెలివిలేని పాలనతో గురుకులాలు ఆగం

తన రాజకీయ జీవితంలో ఇంత తెలివి తక్కువ పాలనను చూడలేదని కేసీఆర్ ధ్వజమెత్తారు. రైతులు, మహిళలు, వృద్ధులు, ఆటో డ్రైవర్లు, ఆఖరుకు గురుకులాల విద్యార్థులు కూడా ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'మనం ఉన్నప్పుడు ఆర్ఎస్ ప్రవీణ్ నాయకత్వంలో గురుకులాలను అద్భుతంగా నడిపినం. గురుకులాల్లో చదివిన మన బిడ్డలు ఉన్నతాధికారులుగా తయారైండ్రు. ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్, నిట్ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో సీట్లు సంపాదించిండ్రు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో బంగారు, వెండి పతకాలు సాధించిండ్రు' ఆయన వివరించారు. కానీ, ఇప్పుడు రాష్ట్రంలోని గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగని రోజంటూ లేకుండా పోయిందని వాపోయారు. 14 నెలల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 57 మంది అమాయక విద్యార్థులు చనిపోయారని, ఇందుకోసమా? తెలంగాణ తెచ్చుకున్నది అని ప్రశ్నించారు.

రెవెన్యూ లాస్ 15 వేల కోట్లా?

రాష్ట్రంలో మొదటి త్రైమాసికానికే రెవెన్యూ లాస్ రూ.15 వేల కోట్లు ఉన్నదని, అది రూ.30 వేల కోట్లకు చేరుతుందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారని ఇంత హీనమైన పాలన ఇంకెక్కడా ఉండదని కేసీఆర్ విమర్శించారు. పదేండ్లు అద్భుతంగా పాలించామని, ఏనాడూ ఈ దుస్థితి ఎదురుకాలేదని చెప్పారు. రాష్ట్రంలో అన్ని రంగాలు పడకేశాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్కడైనా ప్రభుత్వాలు మారినప్పుడు గత పాలన కంటే మెరుగ్గా చేయటం, లేదా వాటినే కొనసాగించటం ఆనవాయితీ అని, కానీ, రాష్ట్రంలో అదేమీ లేదని చెప్పారు. సంపద సృష్టించి ప్రజలకు పంచామని చెప్పారు. 2014 నుంచి 2023 దాకా పదేండ్లపాటు తలసరి ఆదాయంలో, తలసరి విద్యుత్తు వినియోగంలో దేశ సగటు కన్నా అనేక రెట్లు ముందున్న విషయాన్ని ఆయన వివరించారు. అయితే, ఇటీవల రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆర్‌బీఐ, కాగ్ లెక్కలను బీఆర్ఎస్ సాధించిన విజయాలను వెల్లడించి, వాటిని వెబ్‌సైట్లో పెట్టి చివరికి నాలుక కరచుకొని వాట్లోంచి తొలగించారని చెప్పారు. వెబ్‌సైట్లోంచి అయితే తొలగించారు కానీ, ప్రజల జీవితాల నుంచి జీవిక నుంచి వాస్తవాలను చెరిపేయలేరనే విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు.